# 14. రెండు వాగుల మధ్యనొక ఊరు

వెనుకనుంచి మేఘం తరుముకువస్తున్నది.

ఇల్లు విడిచినప్పుడు ఎండగానే ఉంది.

మధ్యాహ్నం భోజనాలయిన వెంటనే రెండున్నరకు రెండెడ్లబండి బయలు దేరింది. అల్లుడు మూర్తి, కూతురు సుశీల, చంటి పిల్లడు మనుమడు అడ్డ రోడ్డు దగ్గిర బస్సెక్కుతారు. చోటు వాళ్లుంటున్న పల్లెటూరికి పదహారు మైళ్ల దూరంలో ఉంది. ఆ దారిలో పోయే బస్సు రాత్రి ఏడు గంటలకు అక్కడికి వస్తుంది. స్టేషను మరో గంటలో చేరుకోవచ్చు. సులువుగా రైలు అందుతుంది.

మధ్యాహ్నం మూడున్నరకు ఆకాశంలో లోచిన మేఘం క్రమంగా వ్యాపించింది.

పదహారు మైళ్ల బండిదారి రెండు కొండ వాగులను దాటుతుంది. ఏదో వర్షం వచ్చినప్పుడు తప్ప ఆ రెండింటిలో ఎప్పుడూ నీరుండదు.

వెంకటరామయ్యగారు తన స్నేహితుడు నరసయ్యను పిలిచి కూతురుని, అల్లుడిని, మనుమడిని అడ్డురోడ్డు దగ్గిర బస్సెక్కించడానికి రెండెడ్ల బండిని పురమాయంచారు.

ఆరుమైళ్ల తరువాత వచ్చిన మొదటి కొండవాగును వాళ్లు దాటిపోయారు.

అప్పటికి నాలుగు గంటలయింది.

మరో ఆరుమైళ్ల తరువాత రెండో వాగు వస్తుంది.

(మూర్తికి సెలవయి పోయింది. మరునాడు ఉద్యోగంలో చేరాలి).

పల్లెటూళ్లో అతని మరదలికి పెళ్లయింది. పెళ్లి కొడుకు కూడా ఆవూరివాడే, పై నుంచి బంధువులు అంతగా రాలేదు.

అడ్డరోడ్డు చేరడానికి నాలుగు గంటలు పడుతుంది. బస్సు అక్కడికి రాడానికి మరో అరగంట వ్యవధి – రాత్రి ఎనిమిది, స్టేషను చేరుకోవచ్చు (రైలు ఏ అర్ధరాత్రికోవస్తుంది. మరే ఇబ్బంది లేకుండా కూతురు, మనుమడు, అల్లు డు (ప్రయాణం చెయ్యవచ్చు)

మూర్తి సర్దుకొని కూర్చున్నాడు. మూడు రోజుల నుండి పెళ్లివారింట చెమటలు కారిపోయాయి. వెనుకనుంచి వస్తున్న చల్లనిగాలి ఊరటకలిగించింది.

సాయంకాలం అయిదయే సరికి మేఘం పూర్తిగా ఆకాశాన్ని కప్పివేసింది. పట్టపగలే చీకటి తోచింది. గాలి వేగంగా వీచడం మొదలయింది.

ముందుకు పోవలసినదాని ఎగుడుగా ఉంది. గాలి వెనుక నుంచి వెయ్యడం నుంచి ఎడ్లకు కష్టమనలేదు.

"ఇంకా మనం ఎన్ని మైళ్లు వెళ్లాలి?" మూర్తి నరసయ్యను అడిగాడు.

"రమారమి సగం దూరం వచ్చాము." అన్నాడు నరసయ్య

"గాలి మొదలయింది. అందుచేత మేఘం తేలిపోవచ్చు" అన్నాడు మూర్తి.

నరసయ్య ఎడ్లను తోలుతూ అన్నాడు :

"ఈ వాన పోకడలు ఎవరికి తెలుస్తాయి?"

మూర్తి ఊరకున్నాడు.

కొద్ది సేపటిలో రెండు పెద్ద చినుకులు బండికప్పు మీద పడ్డాయి. వెనుకకు కూర్చున్న మూర్తి చేతులమీద మరో రెండు పడ్డాయి.

"పై కప్పు కారదు గదా?" మూర్తి నరసయ్యను అడిగాడు.

"మంచి ప్లాస్టిక్ గుడ్డపై పూర్తిగా కప్పాను." అన్నాడు. నరసయ్య.

ఆ గాలి బలం పుంజుకుంటున్నది.

ఆ వర్షం క్రమంగా ఊపందుకుంటున్నది.

పెద్ద మెరుపులు ఆకాశాన్ని చీల్చుతున్నాయి. ఉరుములు - ఉండుండి పిడుగులు. మైదానంలో బండినిలకడగా నడుస్తున్నది.

చంటి పిల్లడిని ఒడిలోకి తీసుకొని చలిగాలికి చీర కప్పింది సుశీల.

"వర్షం వస్తుందని తెలిస్తే మనం ఉండి పోయేవాళ్లం" అంది ఆమె.

మెరుపుల వెలుతురులో ఒకక్షణం పరిసరాలు కనిపిస్తున్నాయి. లేకపోతే అంతా కారు చీకటే. నలిగిన బండి దారిమీద అలవాటు కొద్దీ ఎడ్లు నడుస్తున్నాయి.

"రెండో వాగు ఎంతదూరముంటుంది?" మూర్తి నరసయ్యను అడిగాడు.

"ఇంకా రెండు మైళ్లు" అన్నాడు నరసయ్య

బండి పల్లంవేపు నడుస్తున్నది.

మెరుపుల వెలుగులో మూర్తి రిస్టువాచీ చూసుకున్నాడు - ఆరుగంటలు.

బండి పరుగులు తీస్తూ ఒక్కసారి ఆగిపోయింది.

ఆ రెండో వాగు చాల జోరుగా పారుతున్నది.

మూర్తి బండి దిగాడు. కారు చీకటిలో వాగు చేసే హెూరు మాత్రమే వినిపిస్తున్నది. వర్షం పడుతున్నది.

"కొంచెం సేపు ఆగితే" మూర్తి అన్నాడు.

"కొండలమీద హెచ్చుగా వానపడుతున్నది. ఈ వాగు ఇంకా వెర్రెత్తిపోతుంది." అన్నాడు నరసయ్య.

"ఈ రాత్రికి ఎక్కడుండాలి?" మూర్తి అడిగడు.

"మనం వస్తుంటే ఎడంచేతివేపు ఎత్తైన చోట ఒక ఊరుంది. రెండు వందల

గడప. తెలిసిన వాళ్లెవరింటికేనా పోవచ్చు. రాత్రి అక్కడ గడిపి ఉదయం బస్సుకి వెళ్లిపోదాం."

మూర్తి ఆలోచిస్తున్నాడు.

"ఆలోచనదేనికి? చంటిపిల్లడు తడిసిపోతాడు. బండి వెనక్కు తిప్పమనండి." అంది సుశీల.

"తిరిగి మామగారింటికి వెళ్లిపోతే!" అన్నాడు మూర్తి

"మొదటి వాగు కూడా ఈ విధంగానే ఉంటుంది" అన్నాడు నరసయ్య.

"నరసయ్య! ఎవరింటికో తీసుకుపో...." అంది సుశీల.

మరొక అరగంటలో ఊళ్లో ఒక ఇంటి దగ్గిర బండి ఆగింది.

అది పెద్ద పెంకుటిల్లు. వీధివేపు విశాలమైన వరండా ఉంది. వర్షపు జల్లుతో అది తడిసిపోయింది.

"చలమయ్య భుగతా! చుట్టాలొచ్చారు." నరసయ్య గట్టిగా అరిచాడు.

"ఈ వర్షంలో ఎవరబ్బా!" లోపలి నుంచి మగగొంతుకు వినిపించింది. వీధి తలుపు తెరచుకొని కొంచెం వయసు మళ్లిన ఒకతను హరికన్ లాంతరు పట్టుకొని వరండాలోకి వచ్చాడు.

"నేను నరసయ్యను. వెంకట రామయ్యగారి అల్లుడు, కూతురు, మనుమడు అడ్డు రోడ్డు దగ్గర బస్సెక్కడానికి వచ్చారు. ఇంతలో వర్షం ముంచుకొని వచ్చింది. ముందు వాగు కదనం తొక్కుతున్నది. వెనకది కూడాదానికి తీసిపోదు. వర్షం తగ్గిన తరువాత రేపు వెళ్లిపోతారు."

"మరి నీ సంగతి?" చలమయ్య అడిగాడు.

"ఈ ఊళ్లో మా చెల్లెలుంది. ఎడ్లను వాళ్ల సాలలో కట్టి, రాత్రికి వాళ్లతో గడుపుతాను."

చలమయ్య లాంతరు చూపిస్తుంటే, సుశీల చంటి పిల్లడితో బండిదిగి వరండాలోకి వెళ్లింది. సామానుదింపిన తరువాత నరసయ్య బండి తోలుకొని వెళ్లిపోయాడు.

ఇంతలో చలమయ్య భార్య, పదిహేనేళ్ల కూతురు చిట్టి వరండాలోకి వచ్చారు.

వర్షం పడుతునేఉంది.

లోపల వెచ్చగా ఉంది. చలమయ్య భార్య తను పడుక్కుంటున్న మంచం చంటి పిల్లడి తల్లికిచ్చింది. మూర్తి తన సూట్‌కేసు చలమయ్య గదిలో పెట్టాడు.

అన్నీ సర్దుకున్న తరువాత సుశీల అంది.

"పిన్నిగారూ పాలడబ్బా మావాళ్లింట మరచిపోయాను. మరో డబ్బా బాబయ్యగారిచేత తెప్పించండి. ఇదిగో వంద రూపాయలనోటు.

పక్కనే నిలుచ్చు చలమయ్య ఆనోటు అందుకున్నాడు.

మళ్లా సుశీలే మాట్లాడింది.

"పిన్నిగారూ! వంట ప్రయత్నం చెయ్యకపోతే..."

"ఇంకా ఏదే అయింది. ఎంతసేపు."

"అదే నేను చెప్తున్నది. ఈ రాత్రికి ఆ ప్రయత్నం చెయ్యకండి. మా అమ్మ రైలులోకి గిన్నె రొట్టి కాల్చి ఇచ్చింది. అది అందరికి బాగా సరిపోతుంది."

ఇంతలో చంటి పిల్లడు లేచి ఏడవడం మొదలు పెట్టాడు.

"ఒసే చిట్టీ, సూరమ్మత్తనడిగి ఆవుపాలు తీసుకురా! సాయంకాలం పితికిన పాలు ఈ సరికి కాచి ఉంచుతుంది." అంది చలమయ్య భార్య కూతురితో.

ఆ పిల్లవెళ్లి మరచెంబుకు సగం వేడిపాలు తెచ్చింది.

పిల్లడికి పాలుపట్టి అందరూ మినపరొట్టె, కొబ్బరి పచ్చడి సుష్టుగా తిన్నారు. మామగరిచ్చినప్పటి తేనె మూర్తి చలమయ్యకిస్తే అతను మరీ ఆనందంతో ఫలహారం పూర్తి చేశాడు.

చలమయ్య కొంతసేపు మూర్తితో ఏవో కబుర్లు చెప్పి, ఇలా అన్నాడు.

"ఓయి మూర్తి! అలా చిట్టబ్బాయిగారింటికి వెళ్లివద్దాం, రా! వర్షం తగ్గింది."

కాదనలేక, మూర్తి చొక్కాతొడుక్కొని, జేబులో పర్సు పెట్టుకొని చలమయ్య వెంటవెళ్లాడు.

చిట్టబ్బాయిగారిల్లు అట్టే దూరంలో లేదు. అక్కడ ముందు గదిలో పెట్రోమాక్సు లైటు వెలుతురులో ముగ్గురు పేకాటకు కూర్చున్నారు.

"నీకోసమే చూస్తున్నామయ్యా, చలమయ్య భుక్తా" ఆ ముగ్గురిలో ఒకతను అన్నాడు.

"మా ఇంటికి చుట్టాలు వచ్చారు. మీ మాట కాదనలేక మా చుట్టాన్ని కూడా తీసుకువచ్చాను." అన్నాడు చలమయ్య.

"చాల బాగుంది, నువ్వాడతవా, లేక అతనా?"

"నాకు పేకట ఆడడం తెలియదు" అన్నాడు మూర్తి.

చలమయ్య సంతోషంగా వాళ్లతో ఆటకు కూర్చున్నాడు.

మొదటి ఆటలో చలమయ్య ఓడిపోయాడు.

"నా దగ్గిర చిల్లరలేదు." చలమయ్య పాలడబ్బాకు సుశీల ఇచ్చిన నూరు రూపాయలనోటు జేబులోంచి తీసి చూపించాడు.

"నేనిస్తున్నాను. నా దగ్గిర చిల్లర ఉంది." మూర్తి పర్సుతీసి పదిహేను రూపాయలు ఇచ్చాడు.

రెండో ఆట చెలమయ్య గెలిచాడు. ఆబగా ఆ డబ్బు అతడు జేబులో వేసుకున్నాడు.

అలాపేకాట ముందుకుసాగింది.

చలమయ్యకు ఏభై రూపాయలు వచ్చాయి. మూర్తికి ఎనభై రూపాయలు వదిలిపోయాయి.

ఆట ముగిసేసరికి రాత్రి రెండు గంటలయింది.

అప్పటికి కూడా వర్షం కురుస్తున్నది.

ఇద్దరూ ఇంటికి తిరిగి వస్తూనే పక్కలమీద పడిపోయారు.

మర్నాడు పొద్దున్న మూర్తి లేచేసరికి తొమ్మిదయింది. అప్పటికే చలమయ్య నిద్రలేచి స్నానాదులు పూర్తిచేసి ముందు గదిలో కుర్చీ మీదకూర్చున్నాడు.

"మూర్తీ! వేగంగా స్నానం చేసిరా. వేడివేడి టిఫిన్ మనకోసం ఎదురుచూస్తున్నది."

మూర్తి మరొక్కపావు గంటలో తయారయివచ్చాడు. తండ్రికి, అతిథికి చిట్టి ప్లేట్లలో వేడి వేడి ఉప్మా, తరువాత కాఫీ తెచ్చింది.

వర్షం జోరు తగ్గింది.

కొండలమీద ఇంకా వర్షం కురుస్తూ ఉండడంచేత వెనుక వాగు, ముందువాగు జోరుగా పారుతున్నాయి. నరసయ్య పొద్దున రెండు వాగులు చూసివచ్చి అన్నాడు.

"బహుశా ఈ పూట కూడా మనం ఇక్కడుండాలి."

పొద్దున్న సూరమ్మ గారింటి నుండి పాలుతెచ్చి, సుశీలను చిట్టి అడిగింది.

"అక్కా! ఒక ఏభై ఉంటే ఇవ్వు, నాన్నతెచ్చిన తరువాత నీకిచ్చేస్తాను. కొన్ని వెచ్చాలు దుకాణం నుంచి తేవాలి"

ఆ డబ్బు పట్టుకుని కందిపప్పు, గోధుమనూక, కాఫీగుండ, నూనె మొదలైనవి కూతురు తెస్తే, తల్లి స్నానంచేసి ఉప్మా తయారు చేసింది. ఈ సంగతి చలమయ్యకుగాని, మూర్తికిగాని తెలియదు.

పిల్లడికి నీళ్లు పోసి, పాలుపట్టి సుశీల తనుకూడా స్నానం చేసి వచ్చింది.

టిఫిన్ తిన్న తరువాత సుశీలకు చిట్టిజడ వేసింది.

జడవేస్తూ చిట్టి అంది.

"అక్కా! నేనోమాట అంటాను. నువ్వు మరేమి అనుకోవుగద!"

"నేనేమీ అనుకోను. చెప్పు!"

"మా అమ్మ, నాన్న పార్వతీపరమేశ్వరులవంటివాళ్లు. వాళ్లిద్దరికీ దంపతీ పూజ చేస్తే నీకు చాలపుణ్యం వస్తుంది. నువ్వు పెట్టి తీసినపుడు నెమలికంఠం రంగుచీర, జరీఅంచు పంచలచాపు, కొత్తవి చూశాను. వాళ్లిద్దరినీ కూచోపెట్టి పూజ చేసుకో. ఇటువంటి అవకాశం

నీకు మరెప్పుడూ దొరకదు.

సుశీల ఆలోచించింది. చిట్టి చాలతెలివైన పిల్ల. తన అమయికత్వాన్ని, మంచితనాన్ని సొమ్ము చేస్తున్నది.

"అలాగే!" అంది సుశీల బరువుగా.

పదకుండు గంటలకు చలమయ్యను, అతని భార్యను పీటలమీద కూర్చోబెట్టి సలక్షణంగా, దక్షిణ తాంబూలాలు పెట్టి సుశీల దంపతీ పూజ చేసుకుంది. చిట్టి చేతిలో ఒక యాభై రూపాయలు పెట్టింది.

నెమలి కంఠం రంగుచీర అత్తగారు ప్రత్యేకంగా సుశీలకోసం కొన్న సంగతి మూర్తికి తెలుసు. మరీ దంపత్ పూజ ఏమిటో అతనికి అంతుపట్టలేదు.

మధ్యాహ్నం భోజనాలు ఒంటిగంటకయాయి. చలమయ్య గారి పెరటిలో గోంగూర బాగా పెరుగుతున్నది. గోంగూర పప్పు, గోంగూర పచ్చడి, రెండేసి సార్లు కలుపుకొని చలమయ్య తిన్నాడు. మూర్తి మాత్రం ఆవిధంగా తినలేకపోయాడు. చంటి పిల్లడి తల్లి సుశీల కొంచెం జాగ్రత్తగానేతింది.

రాత్రి భోజనాల ముందు చంటిపిల్లడికి పాలు కావలసివచ్చాయి.

"అక్కయ్యా? ప్రతిసారి నేను పాలడిగితే సూరమ్మత్త విసుక్కుంటున్నది. ఈసారి నువ్వడిగితే బాగుంటుంది." అంది చిట్టి.

సుశీల మరచెంబు తీసుకొని సూరమ్మగారింటికి వెళ్లింది. ఆవిడ ఒక్కర్తే ఇంటిలోను ఉంటున్నది. పూటకు రెండు శేర్లు పాలిచ్చే ఆవు, కొట్లనిండా ధాన్యం, ఆవిడ సంపన్నురాలని చెప్పడానికి చాలు.

ఈ మాట, ఆ మాట ఆడిన తరువాత సుశీల ఆవిడతో అంది.

"మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను. ప్రయాణం సందడిలో పాలడబ్బా మా వాళ్లింట్లో మరచిపోయి వచ్చాను. ఇక్కడికి వచ్చిన వెంటనే చలమయ్య బాబయ్యగారికి నూరు రూపాయల నోటిచ్చి పాలడబ్బా తెమ్మన్నాను. కాని, అతను అవుననలేదు. కాదనలేదు. ఇంకా అడుగుతే బాగుండదని ఊరుకున్నాను.

"పిచ్చిపిల్లా! పాలడబ్బాలు పెదబాబు దుకాణంలో దొరక్కపోడమేమిటి. మొన్నను వచ్చినట్లున్నాయి. ఓపది డబ్బాలు ఎదురుగుండా బల్లమీద కొలువుతీరి ఉన్నాయి."

అప్పుడు సుశీలకు నిజం తెలిసివచ్చింది.

రాత్రి ఎనిమిది గంటలకు భోజనాలు చేశారు. మధ్యాహ్నం వండిన గోంగూర పప్పు ఇప్పుడు పులుసుగా మార్చారు. గోంగూర పచ్చడిలో వెల్లుల్లిపాయలు వేయించి వేశారు. సాయంకాలం వరకు నిద్రపోయిన చలమయ్య అవురావురుమంటూ పుసుతోను,

పచ్చడితోను తిన్నాడు. మూర్తి ఏదోతిని భోజనం ముగించాడు. సుశీల ఆ పచ్చడివేపు పోలేదు.

మరొక్క అరగంటలో చలమయ్య ఇల్లు విడిచివెళ్లిపోయాడు. మూర్తిని తనతో చినబాబు గారింటికి తీసుకుపోలేదు. సుశీల ఇచ్చిన నూరు రూపాయలనోటు, నిన్న రాత్రి గెలిచిన ఏభైరూపాయలు జేబులో పెట్టుకొని పేకాట ఆడడానికి కూర్చున్నాడు పెళ్లికొడుకులా.

వర్షం బాగా తగ్గింది.

చలమయ్య పేకాటలో అంటా ఓడిపోయి ఇంటికి తిరిగి వచ్చేసరికి కోళ్లుకూశాయి.

ఉదయం ఏడవుతుంటే, చిట్టి గోధుమనూక తేడానికి దుకాణానికి వెళ్లింది.

అప్పటికి వర్షం పూర్తిగా తగ్గిపోయింది.

సుశీల, మూర్తి తొందరగా స్నానాలు చేశారు.

ఈలోగా నరసయ్య వాగు దగ్గిరికి వెళ్లి తిరిగి వచ్చాడు. వాగును దాటవచ్చు.

సూరమ్మతో చెప్పిపోడానికి సుశీల చంటి పిల్లడిని తీసుకొని వెళ్లింది.

"సుశీలా! మీరు పొద్దున్నే వెళ్లిపోతారని తెలుసు. రైలులో తినడానికి మీ కొసం ఉప్పు పిండి చేశాను. సీసానిండా పెరుగుపోశాను. నీ పిల్లడికి పట్టడానికి, తెల్లవారు వేళ పితికిన పాలు కాచి నీ మరచెంబు నిండా పోస్తున్నాను. మీరు మీ ఊరు చేరుకునే వరకు పాలు పాడవవు. ఈసారి మీ పుట్టింటికి వచ్చేటప్పుడు, దారిలో మా ఊళ్లో దిగి ఒకపూట మా ఇంట ఉండివెళ్లు."

సుశీల పాలు, ఫలహారం, పెరుగు పట్టుకొచ్చేసరికి నరసయ్య బండి సిద్ధంగా ఉంది. సామాను ఆ సరికే బండిలో సర్దాడు మూర్తి. చలమయ్యను నిద్రలేపి అతనితోను, అతని భార్యతోను చెప్పివాళ్లు బండెక్కారు.

దారిలో దుకాణం అరుగుమీద చిట్టి కూర్చుంది. బండిలో వాళ్లకు చెయ్యి ఊపింది.

వాగుదాటి అడ్డురోడ్డు చివరకు వాళ్లు వచ్చిన పది నిమిషాలకు బస్సు వచ్చింది. నరసయ్య వాళ్లసామాను బస్సులోకి ఎక్కించాడు.

వాళ్లు తొమ్మిదికి స్టేషను చేరుకున్నారు.

విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు లైన్‌క్లియర్ కొట్టారు.

అప్పుడు టిక్కెట్లు కొనితేడానికి మూర్తి పర్సు తీశాడు.

"నా దగ్గర ఏభై రూపాయలే ఉన్నాయి. నీ దగ్గిర ఎంతుందో చూడు" అన్నాడు సుశీలతో.

సుశీల పెట్టంతా వెదకింది. ఇంకా రెండు టిక్కెట్లు కొనడానికి ఇరవై రూపాయలు తక్కువయాయి.

మూర్తికేమీ పాలుపోలేదు.

అప్పుడు సుశీలకు జ్ఞాపకం వచ్చింది.

"అన్నట్టు మరచిపోయాను సూరమ్మగారు పిల్లడి చేతిలో ఇరవై రూపాయలు పెట్టారు. నోటుకొంగుకు ముడివేశాను."

సుశీల కొంగు ముడివిప్పినోటు మూర్తి చేతికి ఇచ్చింది.

ఆ దంపతుల ముఖాలతో చెప్పుకోలేని కృతజ్ఞతాభావం తోచింది.

"సూరమ్మగారు ఉత్తమురాలు. రెండు వాగుల మధ్య చిక్కుకున్న మనవంటి వాళ్లకు ఆమె కల్పవృక్షం. ఆమె చేసిన సహాయం ఎప్పటికీ మరచిపోలేం." అన్నాడు మూర్తి, టిక్కట్ల కోసం వెళ్తూ.